

యువతేజాలు
గ్రూప్‌-1 ఫలితాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులతో సత్తాచాటారు. - 8లో



నృసింహుడికి రాబడి ఎక్కువే..
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం పంచాంగ శ్రవణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. - 8లో



మోత్కూరులో ఉగాది వైభవం
మోత్కూరు పట్టణంలో శ్రీవిశ్వావసునామ ఉగాది వేడుకలను ప్రజలు ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

రంజాన్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్పీ



సూర్యాపేట టౌన్‌: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ నరసింహ కోరారు. రంజాన్ పండుగ సందర్భంగా ఆదివారం ఒక ప్రకటనలో ముస్లింలకు శుభా కాంక్షలు తెలిపారు. జిల్లా పరిధిలోని ఈద్గాలు, మసీద్‌ల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని, ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేస్తామని పేర్కొన్నారు. నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తామని, ఇప్పటికే ప్రధాన చౌరస్తాల్లో పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్, ఇన్‌స్టా గ్రామ్ తదితర సామాజిక మధ్యమాల్లో ఇతరులను కించపరిచేలా పోస్టులు చేయరాదని పేర్కొన్నారు. సోషల్ మీడియాపై పోలీసు వారి నిఘా ఉందని, ఎవరైనా అనుచిత పోస్టులు పెడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలు పరిరక్షించడంలో పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మట్టపల్లిలో విశేష పూజలు



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న అర్చకులు, ఆలయ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని విశేష పూజలు, నిత్యారాధనలు కొనసాగాయి. అనంతరం శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి నిత్య, శాశ్వత కల్యాణాన్ని అర్చకులు వేద మంత్రాల నడము ల వైభవంగా నిర్వహించారు. భక్తులను తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ముందుగా స్వామివారి సన్నిధిలో శ్రీవిశ్వావసునామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఆ తర్వాత అర్చకులు పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, అనువంశిక ధర్మకర్త చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్ కుమార్, అర్చకులు తుమాటి లక్ష్మణాచార్యులు, నర్సింహమూర్తి, ఆంజనేయచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నల్లబెలూన్లతో దివ్యాంగుల నిరసన



గుంపులలో నల్లబెలూన్లతో నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

చివ్వెంల: దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి హుజూర్‌నగర్ పర్యటనను నిరసిస్తూ ఆదివారం చివ్వెంల మండలం గుంపుల గ్రామంలో దివ్యాంగులు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నల్లబెలూన్లు ఎగురవేసి నిరసన తెలిపారు. అంతకు ముందు పలువురు దివ్యాంగులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి చివ్వెంల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం భారత వికలాంగ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. దివ్యాంగులలకు పింఛన్ పెంచి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్య బాబు, మున్నా మధు, పబ్బు వెంకటమ్మ, ముత్తమ్మ, రాములమ్మ, సత్యనారాయణ, సక్కుబాయమ్మ, పద్మ, లక్ష్మి, లతీఫ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



వేదికపై సీఎం రేవంత్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

ఉద్దండుల గడ్డ..

ధాన్యంలో ఘనత



సభావేదిక పైనుంచి అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- రాష్ట్రంలోనే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వరి అత్యధికం
- సన్నబియ్యం పథకంతో హుజూర్‌నగర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది
- పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- హుజూర్‌నగర్‌లో అగ్రికల్చర్ కాలేజీ.. కోదాడలో నవోదయ పాఠశాల
- మిర్యాలగూడ, దేవరకొండకు 'యంగ్ ఇండియా' స్కూళ్లు
- ఉమ్మడి జిల్లాపై సీఎం వరాల జల్లు



ఆరు కిలోల సన్నబియ్యం సంచిని లబ్ధిదారుకు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు, మండలి చైర్మన్, ఎంపీలు, ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ రూరల్ : భూమి కోసం, భుక్తి కోసం విముక్తి కోసం పోరాటాలు చేసిన వీరులగడ్డ నల్లగొండ జిల్లా. అన్ని రంగాలలో ఉద్దండులు ఉన్న ఈ జిల్లా.. సన్నరకం ధాన్యాన్ని పండించడంలోనూ ఘనత సాధించింది అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 లక్షల ఎకరాలలో వరి పండిస్తున్నారని సీఎం తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రైస్‌మిల్లులు ఎక్కువగా ఉన్నది నల్లగొండ జిల్లాలోనే అని ఆయన చెప్పారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన రేషన్ కార్డుదారులకు 6 కిలోల ఉచిత సన్న బియ్యం పంపిణీ పథకాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చే సిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజనూ కొనాలని నిర్ణయించిందని, సన్న వడ్లకు ప్రోత్సాహకంలో భాగంగా 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని, బోనస్, రుణమాఫీ కూడా ఉమ్మడి నల్లగొండ జిల్లాకే ఎక్కువగా వచ్చిందని చెప్పారు. సన్న బియ్యం పథకం ప్రారంభానికి వేదికైన హుజూర్ నగర్.. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని సీఎం అన్నారు.

టన్నెల్ పనులు కొనసాగిస్తాం..

ఇటీవల ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్లో ప్రమాదం చోటుచేసుకున్న నేపథ్యంలో టన్నెల్ భవిష్యత్‌పై నీలి నీడలు కుమ్ముకోగా ఆ పనులను కొనసాగిస్తామని, టన్నెల్ పనులను పూర్తి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. హుజూర్‌నగర్‌లో అగ్రికల్చర్ కాలేజీని మంజూరు చేస్తామని, కోదాడకు జవహర్ నవోదయ విద్యాలయాన్ని మంజూరు చేస్తానని సీఎం చెప్పారు. ఈ సందర్భంగా మిర్యాలగూడకు యంగ్ ఇండియా రెసిడెన్సియల్ స్కూల్ కావాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దేవరకొండకు యంగ్ ఇండియా స్కూల్ కావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరగా.. వాటిని ఇస్తానని అయితే అక్కడికి వెళ్లినప్పుడు ప్రకటిస్తానని సీఎం పేర్కొన్నారు. అలాగే హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 2,160 సింగిల్ బెడ్రూం ఇండ్లకు రూ.60 కోట్లు మంజూరు చేశానని, అవి త్వరలోనే పూర్తవుతాయని అన్నారు. జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయిస్తామని సీఎం తెలిపారు. కృష్ణపట్టె ప్రాంతం చైతన్యానికి మారుపేరని, కోదాడ హుజూర్‌నగర్ కాంగ్రెస్‌కు కంటచుకోటని కార్యకర్తలు నిరూపించారని ఆయన అన్నారు. రావి నారాయణరెడ్డిని అత్యంత మెజార్టీతో గెలిపించింది నల్లగొండేనని, అదే విధంగా ఎంపీ ఎన్నికల్లో రఘువీర్‌రెడ్డిని 5.60 లక్షల మెజార్టీతో గెలిపించారని, దక్షిణ భారత దేశంలోనే ఇది అత్యధిక మెజార్టీ అని అన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నుంచి లక్ష చొప్పున మెజార్టీ వస్తుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబితే తాను నమ్మలేదని, అది నిరూపించారని సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్ బాబు, సీతక్క, ఎంపీలు కుందూరు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల రావు, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బీర్ల ఐలయ్య, మందుల సామేల్, వేముల వీరేశం, బాలు నాయక్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, మీర్ అలీఖాన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సెక్రటరీ డీఎస్ చౌహాన్, ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హరీష్, విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఎస్పీ నరసింహ పాల్గొన్నారు.

మీఊరి కోడలు .. మాఊరి ఆడబిడ్డ

'మీ ఊరి కోడలు.. మా ఊరి ఆడబిడ్డ' అని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిని ఉద్దేశించి సభలో సీఎం రేంవత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తొలుత సభావేదికపైకి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే పద్మావతి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

మోడల్ కాలనీని సందర్శించిన సీఎం

హుజూర్‌నగర్ పట్టణంలోని సీతారామస్వామి గుట్ట వద్ద నిర్మాణంలో ఉన్న మోడల్ కాలనీని సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన సీఎం, మంత్రులకు సీఎస్ శాంతికుమారి, జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్‌పవార్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అక్కడ ఇళ్లను సీఎం.. మంత్రి ఉత్తమ్‌తో కలిసి పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల తీరును సీఎంకు రాష్ట్ర హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ వివరించారు. 135 బ్లాక్‌లు చేపట్టి 2,160 ఇళ్లను నిర్మించినట్లు సీఎంకు తెలిపారు. అత్యాధికంగా ఒకే చోట అన్ని హంగులతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. పార్క్, కమ్యూనిటీ హాల్, మార్కెట్ వంటి సౌకర్యాలు చేపట్టినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలోనే ఇంత భారీగా సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించడం ఇదే మొదటిసారి అని, పట్టణానికి అతి సమీపంలో ఉండడం, ప్రజల అవసరాలకు ఎటువంటి ఇబ్బందులు ఉండబోవని ఆయన సీఎంకు తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటన సాగిందిలా..

హుజూర్‌నగర్, హుజూర్‌నగర్‌రూరల్ :

- సాయంత్రం 5.56 గంటలకు హుజూర్‌నగర్‌లోని ఫణిగిరి గుట్ట వద్ద మోడల్‌కాలనీ ప్రదేశంలో ముఖ్యమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ అయ్యింది.
- 5.57 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డికి సీఎస్ శాంతికుమారి, కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.
- 6.00 గంటలకు మోడల్ కాలనీలో ఇళ్లను ముఖ్యమంత్రి, మంత్రులు పరిశీలించారు.
- 6.16 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి.. మోడల్ కాలనీ నుంచి రాజీవ్ సభా ప్రాంగణానికి కాన్వాయ్‌లో మంత్రులతో కలిసి బయలుదేరారు.
- 6.22 గంటలకు సభా వేదికపైకి మంత్రులతో కలిసి సీఎం రావడంతో ప్రజలు హర్షధ్వానాలు, కేరింతలు కొట్టారు.
- 6.25 గంటలకు తెలంగాణ గీతాలాపన చేశారు.
- 6.32 గంటలకు సభా వేదికపైనే సీఎం, మంత్రులు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు.
- మంత్రి ఉత్తమ్ ప్రసంగం మధ్యలో కోదాడ, హుజూర్‌నగర్ పేర్లు చెప్పిన సమయంలో నాయకులు, కార్యకర్తల డ్యాన్స్‌లు, ఈలలు, చప్పట్లతో సభా ప్రాంగణం మార్మోగింది.
- 6.55 గంటలకు సీఎం ప్రసంగం ప్రారంభమైంది.
- ప్రసంగం మధ్యలో సీఎం రేవంత్‌రెడ్డి.. మంత్రి ఉత్తమ్ పేరు చెప్పడంతో సభా ప్రాంగణం హర్షధ్వానాలతో దద్దరిల్లింది.
- రాత్రి 7.28 గంటలకు సీఎం ప్రసంగం ముగిసింది.
- 33 నిమిషాల పాటు ముఖ్యమంత్రి ప్రసంగం కొనసాగింది.
- సీఎంను వేంకటేశ్వరస్వామి ఫొటో, జ్ఞాపిక, నాగలి, బంజారా టోపీలతో ఘనంగా సన్మానించారు.
- రాత్రి 7.40 గంటలకు సభ ముగిసింది.

బహిరంగ సభ విజయవంతం

పేదలకు ఉచిత సన్నబియ్యం పంపిణీ పథకం ప్రారంభం సందర్భంగా ఆదివారం హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ విజయవంతమైంది. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో కాంగ్రెస్ నాయకుల్లో జోష్ నెలకొంది. ఈ సభకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తుండటంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని సభను జయప్రదం చేయడంలో సఫలీకృతులయ్యారు. పట్టణంలోని ప్రధాన రోడ్లు, సభా ప్రాంగణంలో సీఎం రేవంత్‌రెడ్డి, భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు, మూడురంగుల తోరణాలతో పట్టణం త్రివర్ణ మయంగా మారింది. సభకు వచ్చిన జనం కూడా కాంగ్రెస్ జెండాలు, కండువాలు వేసుకుని రావడంతో అంతా మూడురంగుల మయమైంది. రెండు నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామం, గిరిజన తండాల నుంచి ప్రజలు అనుకున్నదానికంటే ఎక్కువగా హాజరయ్యారని నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. సభ ప్రాంగణంలో కళాకారుల ఆటపాటలు అలరించాయి.



మహిళా సంఘాలకు రుణాల వడ్డీ రాయితీ కింద రూ.26.16 కోట్ల విలువ గల చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి , చిత్రంలో స్పీకర్, శాసనమండలి చైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు

సన్న బియ్యం పథకంపై తప్పుడు ప్రచారం

- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

భానుపురి: పేదప్రజల కడుపు నింపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్న బియ్యం పథకం ప్రారంభిస్తే కొన్ని పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో సన్న బి య్యం పథకం ప్రారంభోత్సవ సభకు వెళ్తూ మార్గమధ్యలో సూర్యాపేటలోని రాష్ట్ర టూరిజం డెవప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి నివాసంలో కాసేపు ఆగారు. అనంతరం ఆమె మా ట్లాడుతూ 11 ఏళ్లుగా దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ సన్న బియ్యం ఎందుకు పంపిణీ చేయలేదన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రేషన్‌కార్డులపై ప్రధాని మోదీ ఫొటో పెట్టాలని అడగడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో 90 లక్షలకుపైగా రేషన్‌కార్డులు ఉంటే కేవలం 50 లక్షల కార్డులకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం బియ్యాన్ని ఇస్తుందని, మిగతా వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తే తనకు మళ్లీ రాష్ట్ర అధ్యక్ష పదవి వస్తుందని బండి ఆశ పడుతున్నారని ఎద్దేవా చేశారు. చిరు వ్యాపారులను ఛి ద్రం చేసిన కేంద్ర ప్రభుత్వం దేశంలో ఇద్దరు ముగ్గురికే వ్యాపారాలన్నీ కట్టబెడుతోందన్నారు. బీజేపీ సబ్సిడీలకు వ్యతిరేకమన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్‌పార్టీ తీసుకొస్తే బీజేపీ ప్రభుత్వం మాత్రం పనిదినాలను ఏటేటా తగ్గిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, డాక్టర్ రాంమూర్తియాదవ్, ఉపేందర్ పాల్గొన్నారు.

- 'విశ్వావసు' విజయోస్తు..





సూర్యాపేట పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా పూజలు చేస్తున్న మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఆలయంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తజనం

మిగిలింది ఒక్కరోజే..

పంచాయతీల్లో నేటితో ముగియనున్న ఆస్తిపన్ను వసూలు గడువు

- ఇప్పటికే 91 శాతం వసూలు
- క్షేత్ర స్థాయిలో తిరిగి వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది
- లక్ష్యం పూర్తికి పరుగులు



నాగారంబంగ్లాలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది

2024-25 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను వివరాలు (రూ.కోట్లలో..)

వసూలు లక్ష్యం	12.24
వసూలైంది	11.12
కావాల్సింది	1.12

భానుపురి: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వసూలు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునకు సోమవారం ఒక్కరోజు మాత్రమే గడువు మిగిలి ఉండడంతో వంద శాతం ఆస్తిపన్ను వసూలుకు యంత్రాంగం ఇంటింటికీ తిరుగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.12,24,94,294 ఆస్తిపన్నులు వసూలు చేయాల్సి ఉండగా ఈనెల 27వ తేదీ వరకు రూ.11,12,94,395 (91 శాతం) వసూలు చేశారు.

మొదటి స్థానంలో సూర్యాపేట

ఆస్తిపన్ను వసూళ్లలో సూర్యాపేట మండలం ముందంజలో ఉంది. ఇక్కడ ఇప్పటికే 98 శాతం ఆస్తిపన్నును గ్రామపంచాయతీ సిబ్బంది వసూలు చేశారు. జాజిరెడ్డిగూడెం మండలం 97 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. ఇక అత్యల్పంగా గరిడేపల్లి మండలం 86 శాతం, ఆత్మకూర్ (ఎస్) మండలం 88 శాతంతో వెనుకబడి ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి పార్లమెంట్ ఎన్నికలతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా గ్రామ పంచాయతీ సిబ్బంది పన్నుల వసూలు చేపట్టలేక పోయారు.

లక్ష్యం చేరుకునేలా..

జిల్లాలోని 486 గ్రామ పంచాయతీలు ఉండగా 2,60,081 ఇళ్లలో ఆస్తిపన్ను వసూలుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో పాత బకాయిలు రూ.88,83,116 ఉండగా కొత్త ఏడాది ఆయా ఇళ్లకు రూ.11,36,66,178 వసూలు చేయాల్సి ఉంది. ఇక పాత బకాయి ఈ ఆర్థిక సంవత్సరంతో కలుపుకుని మొత్తం రూ.12,24,99,294 వసూలు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. కాగా నాలుగు రోజుల క్రితం వరకు పాత బకాయి రూ.73.19 లక్షలు, ఈ ఏడాది పన్నులు రూ.10,39,75,387తో కలిపి మొత్తం రూ.11,12,94,395 వసూలయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఒక్క రోజులో ముగియనుండగా పాత బకాయి రూ.15,14,108, ప్రస్తుత సంవత్సరం పన్నులు రూ.96,90,791తో కలిపి మొత్తం రూ.1.12 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మిగిలిన ఒక్క రోజులో వంద శాతం లక్ష్యం చేరుకునేందుకు యంత్రాంగం పరుగులు పెడుతోంది.

లక్ష్యం పూర్తిచేస్తాం

సిబ్బంది క్షేత్ర స్థాయిలో ముమ్మరంగా పన్నులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికే 91 శాతానికి పైగా ఆస్తిపన్ను వసూలైంది. అన్ని గ్రామ పంచాయతీల్లో గడువులోగా వంద శాతం ఆస్తిపన్ను వసూలు చేస్తాం.

– యాదగిరి, డీపీఓ

మండలాల వారీగా పన్నుల వసూలు ఇలా..

మండలం	శాతం				
గరిడేపల్లి	86	తిరుమలగిరి	89	చివ్వెంల	92
ఆత్మకూర్	88	అనంతగిరి	90	చింతలపాలెం	93
నూతనకల్	88	నడిగూడెం	90	మట్టంపల్లి	93
చిలుకూరు	89	పాలకవీడు	90	నేరేడుచర్ల	93
మేళ్లచెరువు	89	పెన్‌పహాడ్	90	హుజూర్‌నగర్	94
మునగాల	89	మద్దిరాల	91	కోదాడ	94
నాగారం	89	మోతె	91	జాజిరెడ్డిగూడెం	97
		తుంగతుర్తి	91	సూర్యాపేట	98

వసంత నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం

యాదగిరిగుట్ట: శ్రీరామనవమిని పురస్కరించుకొని యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి అనుబంధ క్షేత్రం శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీసీతారామచంద్రస్వామి వసంత నవరాత్రి ఉత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టారు. ఉదయం ధ్వజస్తంభం వద్ద విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలను ప్రారంభించారు. స్వస్తి వాచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, దీపారాధనతో పాటు నిత్యపూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణం చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా 5న స్వామి, అమ్మవారి ఎదుర్కోలు, 6న కల్యాణం, 7న ఉదయం శ్రీరాముడి పట్టాభిషేకం, రాత్రి డోల్సోత్సవం, 8న సత్యనారాయణ వ్రతపూజలు నిర్వహించనున్నారు. 9వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

క్లుప్తంగా

మహిళ అదృశ్యం



కొండా శ్రావణి

నిడమనూరు : పండుగకు తల్లిగారింటికి వచ్చిన మహిళ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం అమ్మగూడెం గ్రామానికి చెందిన కొండా శ్రావణి ఉగాది పండుగ సందర్భంగా శనివారం తల్లిగారి ఊరైన నిడమనూరు మండలం గుంటకగూడెం గ్రామానికి వచ్చింది. శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఇంటి పరిసరాలు, బంధువుల ఇళ్లలో వెతకగా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి కూరపాటి వెంకన్న ఆదివారం నిడమనూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ గోపాల్‌రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో బియ్యం చోరీ



నాంపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్ఐ

నాంపల్లి: నాంపల్లి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు బియ్యం చోరీ చేశారు. శనివారం రాత్రి పాఠశాలలో మూడు గదుల తాళాలను పగులకొట్టి మధ్యాహ్న భోజనానికి సంబంధించిన క్వింటాల్ బియ్యంను అపహరించారు. మరో క్వింటా బియ్యం బస్తా, రాగిజావ బ్యాగ్ పాఠశాల ఆవరణలో పడేసి ఉంది. ఈ విషయపై స్థానిక ఎస్ఐ మొగుదాల శోభన్‌బాబు పాఠశాలను ఆదివారం సందర్శించి చోరీ ఘటనపై ఆరా తీశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నరసింహ (ఫైల్)

చింతపల్లి: మండలంలోని హైదరాబాద్ – నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్సై యాదాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండల పరిధిలోని నేల్వాలపల్లి గ్రామానికి చెందిన నర్రావుల నరసింహ (55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 27న సొంత పనుల నిమిత్తం చింతపల్లి మండల కేంద్రానికి వచ్చి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా నసర్లపల్లి వద్ద వెనకనుంచి వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. తీవ్ర గాయాలుకావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాగర్ ఎడమకాల్వలో యువకుడి గల్లంతు

నిడమనూరు: వ్యవసాయ పనుల కోసం వచ్చిన యువకుడు నిడమనూరు మండలం, ముప్పారం గ్రామ సమీపంలోని సాగర్ కాల్వలో గల్లంతయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రానికి చెందిన వరికోత యంత్రం డ్రైవర్లు పచాయప్పన్(26), అంబారసన్, విఘ్నేష్‌లు ఆదివారం స్థానికంగా వరికోత పనులు పూర్తి చేసుకుని వస్తుండగా కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు ముప్పారం గ్రామ సమీపంలోని సాగర్ కాల్వ బ్రిడ్జి మెట్ల వద్ద ఆగారు. పచాయప్పన్, అంబారసన్ కాల్వలోకి దిగి శుభ్రం చేసుకుంటుండగా.. పచాయప్పన్ కాలు జారి కాల్వలో పడిపోయారు. అంబారసన్ కాల్వలో దూకి కాపాడటానికి యత్నించినప్పటికీ పచాయప్పన్ కాల్వ ప్రవాహంలో కొట్టుకుపోయారు. డ్రైవర్ల వెంట వచ్చిన అంజిత్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ గోపాల్ రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతేజాలు

గ్రూప్‌-1 ఫలితాల్లో సత్తాచాటిన ఉమ్మడి జిల్లావాసులు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం విడుదల చేసిన గ్రూప్‌- 1 ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించారు. నిరుపేద కుటుంబానికి చెందిన అభ్యర్థులు ఎలాంటి కోచింగ్ లేకుండానే గ్రూప్స్‌కు సన్నద్ధమై సత్తాచాటగా.. మరొకొంత మంది చదువు పూర్తయిన తరువాత మొదటి ప్రయత్నంలో విజయం సాధించారు.

100వ ర్యాంకు సాధించిన ఏఓ



సంస్థాన్ నారాయణపురం: గ్రూప్‌- 1 ఫలితాల్లో సంస్థాన్ నారాయణపురం మండల వ్యవసాయధికారిణి వర్షితరెడ్డి ప్రతిభ చాటారు. బీఎస్సీ (అగ్రికల్చర్) పూర్తి చేసిన సంవత్సరంలోనే నాలుగు ఉద్యోగాలు సాధించింది. ఎలాంటి కోచింగ్ లేకుండానే ఈ ఉద్యోగాలు సాధించడం విశేషం. ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 100వ ర్యాంకును సాధించింది. ఈమె 10వ తరగతి వరకు విద్యాభ్యాసం వికారాబాద్‌లో, ఇంటర్ హైదరాబాద్‌లో, బీఎస్సీ(అగ్రికల్చర్) ఏపీలోని మహానందిలోని సాగింది. గ్రూప్స్ కోసం పక్కా ప్లానింగ్‌తో చదవానని పేర్కొంది.

సత్తాచాటిన జువేరియా



మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణం బంగారుగడ్డ కాలనీకి చెందిన జువేరియా గ్రూప్‌-1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 166వ ర్యాంకు సాధించింది. తల్లిదండ్రులు మౌజంఅలీ, అమీనాబి రెండవ కూతురైన జువేరియా హైదరాబాద్ కోటి ఉమెన్స్ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేసింది. గ్రూప్‌-1 ఫలితాల్లో 465.5 మార్కులు సాధించింది. ప్రతిరోజు 10-12 గంటలు చదువు కొనసాగించానని, ఎక్కడ కోచింగ్ తీసుకోకుండానే గ్రూప్‌-1 సాధించడం సంతోషంగా ఉందని తెలిపింది.

సొంతంగా సన్నద్ధమై..



రుచిత

కొండమల్లేపల్లి: రోజుకు 14 గంటల ప్రిపరేషన్, తల్లిదండ్రుల ప్రోత్సాహం గ్రూప్ -1లో సెలెక్ట్ అయ్యేలా చేసింది. కొండమల్లేపల్లికి చెందిన ఎల్లెబోయిన రుచిత టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్‌-1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 47వ ర్యాంక్ సాధించింది. మండల కేంద్రానికి చెందిన ఎల్లెబోయిన రవి, శోభ దంపతుల కుమార్తె రుచిత తన ప్రాథమిక విద్యాభ్యాసం కొండమల్లేపల్లిలోనే కొనసాగింది. డిగ్రీ అనంతరం ఢిల్లీలో ఆరు నెలల పాటు సివిల్స్ కోచింగ్ తీసుకుంది. తరువాత హైదరాబాద్‌లో ఉంటూ సొంతంగా సివిల్స్‌కు సన్నద్ధమైంది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్‌-1 ఉద్యోగ నియామకంలో రుచిత జనరల్ ర్యాంకింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 47వ ర్యాంక్ సాధించింది.

ప్రజలకు సేవ చేస్తా..

చిన్ననాటి నుంచి కలెక్టర్ కావాలనే ఆశయంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యా. ఢిల్లీలో తీసుకున్న కోచింగ్‌తో పోటీ పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలో ఒక అవగాహన వచ్చింది. స్వతహాగా గ్రూప్స్‌కు సిద్ధమయ్యా. తాజాగా వెలువడిన గ్రూప్‌-1 జనరల్ ర్యాంకింగ్స్‌లో 47వ ర్యాంక్ సాధించడం పట్ల సంతోషంగా ఉంది. డిప్యూటీ కలెక్టర్ లేదా డీఎస్పీ వచ్చే అవకాశాలు ఉండొచ్చని భావిస్తున్నాను. ఏదేమైనా ఉద్యోగంలో చేరాక నావంతుగా పేదలకు సేవ చేస్తా.

– ఎల్లెబోయిన రుచిత

నిరంతరం శ్రమించి..



తెజావత్ అశోక్

మిర్యాలగూడ : దామరచర్ల మండలం దుబ్బతండాకు చెందిన తెజావత్ అశోక్ గ్రూప్‌- 1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 124వ ర్యాంకు సాధించాడు. తెజావత్ లక్ష్మణ్, బూరి దంపతుల కుమారుడైన అశోక్ హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేశాడు. ప్రభుత్వం హైదరాబాద్‌లోని రాజేందర్‌నగర్‌లో ఎస్టీ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందాడు. యూపీఎస్సీ సివిల్ సర్వీస్ పరీక్ష రాయగా ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణుడయ్యాడు. ప్రభుత్వ విడుదల చేసిన గ్రూప్‌- 1 పరీక్షలో ర్యాంక్ సాధించాడు. ఉన్నత స్థాయిలో చూడాలనుకున్న తన తల్లిదండ్రుల కోరిక మేరకు కష్టపడి చదివానని తెలిపాడు.

ఇంటి వద్దే ఉండి ప్రిపేర్ అయి..



నరేష్

అర్వపల్లి: సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన మాండ్ర నరేష్ గ్రూప్‌- 1 ఫలితాల్లో 466 మార్కులు పొంది రాష్ట్ర స్థాయిలో 290 ర్యాంక్ సాధించాడు. నరేష్ సోదరుడు రమేష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా నరేష్ చిన్నతనంలోనే గ్రూప్‌- 1లో రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ సాధించాడు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన అన్నాదమ్ముళ్లు తాత, నానమ్మల దగ్గర ఉంటూ పెరిగారు. నరేష్ 10వ తరగతి వరకు తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో చదవుకొని ఇంటర్ సూర్యాపేటలో పూర్తిచేశాడు. హైదరాబాద్‌లో డిగ్రీ పూర్తిచేసి ఇంటివద్ద ఉంటూ గ్రూప్స్‌కు సన్నద్ధమయ్యాడు. ర్యాంక్‌ను బట్టి గ్రూప్ -1 అధికారిగా ఎంపికకానున్నారు.

ఐఏఎస్ సాధించడమే లక్ష్యంగా..



మనోజ్ కుమార్

మునుగోడు: మునుగోడు మండలంలోని గూడపూర్ గ్రామానికి చెందిన నన్నూరి మనోజ్‌కుమార్ రెడ్డి గ్రూపు – 1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 11వ ర్యాంకు సాధించాడు. వెంకట్‌రాంరెడ్డి విజయ దంపతుల కుమారుడు మనోజ్ ఆరేళ్లుగా సివిల్స్ సాధించేందుకు సన్నద్ధమవుతున్నాడు. ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 11వ ర్యాంకు సాధించాడు. ఈ ర్యాంకును బట్టి డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వస్తుందని తెలిపాడు. తన లక్ష్యం ఐఏఎస్ సాధించడమేనని, అందుకు నిరంతరం శ్రమిస్తానని పేర్కొంటున్నాడు.

ఓ పక్క విధులు నిర్వహిస్తూనే.. గ్రూప్స్‌కు సన్నద్ధమై..



నల్లగొండ: నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలం బోయగూడ గ్రామానికి చెందిన భగవంత్‌రెడ్డి, జయమ్మల కుమారుడు నాగార్జున్ రెడ్డి. టెన్త్ వరకు రాజవరం ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. ఇంటర్, డిగ్రీ హాలియాలోని ప్రైవేట్ కాలేజీల్లో పూర్తి చేశారు. చదువులో ఎప్పుడూ మొదటి స్థానంలో ఉండే నాగార్జునరెడ్డి వ్యవసాయంలో తల్లిదండ్రులు చేసే కష్టం చూసి కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకున్నాడు. ఇంటర్ తర్వాత టీటీసీ పూర్తి చేసిన ఆయన 2006 డీఎస్సీలో 7వ ర్యాంకు సాధించాడు. 2011లో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగంలో 6వ జోన్ పరిధిలో మొదటి రాంకర్‌గా నిలిచాడు. 2012లో గ్రూప్‌-2కు ఎంపికయ్యాడు. నిడమనూరు, నల్లగొండ, హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా పనిచేశాడు. ఇటీవల ప్రకటించిన గ్రూప్ -1 ఫలితాల్లో 900 మార్కులకు గాను 488 మార్కులు సాధించాడు. ఓ పక్క విధులు నిర్వహిస్తూనే మరోపక్క ఉద్యోగాలు సాధిస్తూ వచ్చాడు.

మోటకొండూర్ మండల వాసికి 60వ ర్యాంక్



మహేష్ రెడ్డి

మోటకొండూర్: మోటకొండూర్ మండలంలోని నాంచారిపేట గ్రామానికి చెందిన పైళ్ల విఠల్‌రెడ్డి–రమాదేవిల కుమారుడు పైళ్ల మహేష్ రెడ్డి గ్రూప్‌-1 ఫలితాల్లో సత్తా చాటాడు. 469 మార్కులతో రాష్ట్రస్థాయిలో 60వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం సైబరాబాద్ క్రైమ్ సెక్యూరిటీ బ్యూరో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు. టీఎస్‌పీఎస్సీ ఫలితాల్లో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(డీఎస్పీ)గా ఎంపిక కావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నేడు ఈద్ - ఉల్- ఫితర్

- ముగిసిన ముస్లింల ఉపవాస దీక్షలు
- ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గాలు



భువనగిరిలో నమాజ్ కోసం ముస్తాబు చేసిన ఈద్గా

భువనగిరిటౌన్: పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. శవ్వాల్ నెల ప్రారంభ సూచిగా ఆదివారం సాయంత్రం నెలవంక దర్శనం ఇవ్వడంతో ముస్లింలు రంజాన్‌కు సిద్ధమయ్యారు. సోమవారం ఈద్- ఉల్- ఫితర్ నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈమేరకు ఈద్గాలు, మసీదులను ముస్తాబు చేశారు.

ఈద్–ఉల్–ఫితర్ చరిత్ర..

నెల రోజులపాటు రంజాన్ దీక్షలు పాటించిన ముస్లింలు పవిత్ర మాసం అనంతరం షవ్వాల్ నెల మొదటి రోజు నిర్వహించుకునే పండుగే ఈద్–ఉల్ -ఫితర్. నమాజ్ చేసిన అనంతరం ఇష్రాఖ్ సమయం ప్రారంభమైన తర్వాత ఈద్–ఉల్–ఫితర్ రెండు రకాలుగా నమాజ్ చేస్తారు.

ఫిత్రా దానం

ఈద్- ఉల్ - ఫితర్ రోజున ప్రార్థనలకు ముందు పేదలకిచ్చే దానమే ఫిత్రా. సమాజంలోని నిరుపేదలు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఈ దానం చేస్తారు. పావు తక్కువ రెండు కిలోల గోధుమల తూకానికి సరిపడా పైకాన్ని నిరుపేదలకు దానం చేయాలి.

ఈద్– ఉల్– ఫితర్ నమాజ్ ప్రత్యేకం

ఈద్- ఉల్- ఫితర్ నమాజ్ కోసం ఈద్గాలు, మసీదులను ముస్తాబు చేశారు. ఫజర్ నమాజ్ అనంతరం ఇష్రాఖ్ నమాజ్ సమయం ప్రారంభమైన తర్వాత నమాజ్ చేస్తారు. ఇమామ్‌లు ఈద్- ఉల్- ఫితర్ గురించి ఉపదేశించి నియమాలు వివరిస్తారు. నమాజ్ అనంతరం ఖుద్బాను పఠిస్తారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటారు.

మోత్కూరులో ఉగాది వైభవం



మోత్కూరు ఉగాది వేడుకల్లో ఎడ్ల బండ్ల ప్రదర్శన



శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న పండితులు

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో శ్రీ విశ్వావసునామ ఉగాది వేడుకలను ప్రజలు ఆదివారం వైభవంగా నిర్వహించుకున్నారు. మోత్కూరుతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం, జామచెట్లబావి, కొండాపురం గ్రామాల్లో ఉగాది బోనం వేడుకలు ఘనంగా జరిగాయి. బోనాలు, శివసత్తుల ఆటపాటలు, ఎడ్లబండ్ల పరుగులు, యువకుల బైక్ విన్యాసాలు కనులపండువగా సాగింది. మహిళలు బోనాలతో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకున్నారు. ఎడ్ల బండ్ల పరుగులు, వాహనాల విన్యాసాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బయలుదేరిన బోనాల ఊరేగింపు చెరువు కట్ట వద్ద ఉన్న తూర్పు ముత్యాలమ్మ, అంగడిబజార్‌లోని ముత్యాలమ్మ ఆలయాల వద్దకు చేరుకుంది. మహిళలు అమ్మవారికి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ముందుగా స్థానిక రామలింగేశ్వర ఆలయం వద్ద నుంచి వంశపారంపర్య ధర్మకర్త కల్వల ప్రకాశ్‌రాయుడు ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రులతో పాటు పూజారి లక్ష్మణమూర్తి, గ్రామ పెద్దలు, గుర్రం లక్ష్మీనర్సింహ్మారెడ్డి, మర్రి ఆనందం, బొల్లెపల్లి వెంకటయ్య, పుల్కరం మల్లేషం, పట్వారి అంజయ్య, మరాటి అంజయ్య, జంగ శ్రీను, కోటయ్యలతో పాటు పలువురు బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి దేవతలకు నూతన వస్త్రాలు సమర్పించారు.

నృసింహుడికి రాబడి ఎక్కువే..



ఆలయ మాడ వీధిలో స్వామివారి సేవను ఊరేగిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈఓ, అనువంశిక ధర్మకర్త

- యాదగిరి క్షేత్రంలో వైభవంగా ఉగాది వేడుకలు
- స్వామి వారి ఆదాయం 11,వ్యయం 5, అమ్మవారికి ఆదాయం 11, వ్యయం 11



శ్రీవిశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని పఠిస్తున్న ఆస్థాన సిద్ధాంతి సత్యనారాయణశర్మ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం శ్రీవిశ్వావసు నామ తెలుగు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం యాదగిరి క్షేత్రంలో ఉగాది పచ్చడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శ్రీస్వామి అమ్మవార్లకు నివేదించారు. ఇక సాయంత్రం ముఖ మండపంలో శ్రీస్వామి వారి సేవను అలంకరించి మాడ వీధుల్లో ఊరేగించారు. తూర్పు రాజగోపురం ఎదుట మాడ వీధిలో శ్రీస్వామి అమ్మవార్లను అధిష్టించి పంచాంగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆస్థాన సిద్ధాంతి గౌరిభట్ల సత్యనారాయణశర్మ పంచాంగాన్ని పఠించి, భక్తులకు, అధికారులకు, అర్చకులకు వినిపించారు. శ్రీ యాదగిరి నృసింహస్వామిది తుల రాశి కాగా ఈ ఏడాది శ్రీస్వామి వారికి 11 ఆదాయం, 05 వ్యయం, శ్రీలక్ష్మీ అమ్మవారిది సింహరాశి కాగా ఆదాయం 11, వ్యయం 11గా పేర్కొన్నారు. ఉగాది విశిష్టతను ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు వివరించారు. వేడుకల్లో కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, అర్చకులు, పండితులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

తల్లి అంత్యక్రియలకు కుమారుడు దూరం

- దహనసంస్కారాలు నిర్వహించిన కుమార్తె

సూర్యాపేట అర్బన్: తల్లి అంత్యక్రియలను కుమారుడు నిర్వహించకపోవడంతో కుమార్తెనే ముందుండి దహనసంస్కారాలు చేసింది. ఈ సంఘటన ఆదివారం సూర్యాపేట పట్టణ పరిధిలోని సీతారాంపురం కాలనీలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట పట్టణ పరిధిలోని సీతారాంపురం కాలనీలో నివాసం ఉంటున్న నర్సింగ్ అంజయ్య – చంద్రకళ దంపతులకు కుమారుడు నవీన్, కుమార్తె వసంత ఉన్నారు. వసంత 2015లో కులాంతర వివాహం చేసుకుని వెళ్లిపోయింది. ఈక్రమంలో 2020లో తండ్రి అంజయ్య కరోనాతో మృతిచెందాడు. ఒంటరిగా ఉన్న తల్లి వసంత దగ్గరకు వచ్చి కొన్నిరోజులు ఉండి వెళ్లేది. ఈ క్రమంలో తల్లి ఆరోగ్యం క్షీణించింది. దీంతో కుమారుడు నవీన్ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించాడు. ఈక్రమంలో ఈనెల 27న కుమార్తె వసంత తల్లిని పరామర్శించేందుకు ఆస్పత్రికి దగ్గరికి వెళ్లేసరికి ఆమె మృతిచెందింది. దీంతో ఆమె సోదరుడు నవీన్.. నువ్వు ఎందుకు వచ్చావు, రావద్దని ఆమెతో వాగ్వాదానికి దిగాడు. తల్లి మృతదేహాన్ని తీసుకెళ్లి దహన సంస్కారాలు చేయాలని పేర్కొన్నాడు. దీంతో కుమార్తె వసంత తన భర్త సహకారంతో తల్లి దహన సంస్కారాలు నిర్వహించింది.

స్వర్ణగిరీశుడికి కలశాభిషేకం

భువనగిరి : పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి ఆదివారం విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని అష్టోత్తర శత ఘటాభిషేకం, 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అంతకుముందు ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్ర నామార్చన, నిత్యకల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

దర్వేశిపురం ఆలయ అర్చకుడికి ఉగాది పురస్కారం

కనగల్: దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయ అర్చకుడు నాగోజు మల్లాచారి ఉగాది పురస్కారం అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉగాది పురస్కారాలను అందజేసింది.



మోడల్ కాలనీకి సంబంధించి ఫొటో గ్యాలరీని పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు



అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, చిత్రంలో కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మోడల్ కాలనీలో ఇళ్లను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఒకే ఈతలో ఏడు మేక పిల్లలు



మద్దిరాల: మద్దిరాల మండల పరిధిలోని గుట్టకాడితండా ఆవాసం శ్యాముల్‌తండాలో బానోతు రమేష్‌కు చెందిన మేక ఆదివారం ఒకే ఈతలో ఏడు మేక పిల్లలకు జన్మనిచ్చింది. అన్ని కూడా ఆరోగ్యంగా ఉన్నాయి. స్థానికులు వీటిని ఆసక్తిగా తిలకించారు.

యాదగిరీశుడికి సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం, అర్చన జరిపించారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.